క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండల ఎమ్మార్వో దేవదాస్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

నేడు శ్రీకాంతాచారి విగ్రహావిష్కరణ

నారాయణఖేడ్: తెలంగాణ తొలి అమరవీరుడైన శ్రీకాంతాచారి విగ్రహాన్ని నారాయణఖేడ్ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఈ నెల 28న మధ్యాహ్నం రాష్ట్ర అటవీశాఖ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించనున్నట్లు ఖేడ్ విశ్వకర్మ సంఘం బాధ్యులు వడ్ల కాశీనాథ్‌చారి, రాజాచారి, శీనుచారి, జైపాల్‌చారి, జానేశ్వర్, పండరిచారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొననున్నారని తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం తహసీల్ గ్రౌండ్‌లో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు నూతన ఎంపీపీ ఎన్నిక

రాయికోడ్(అందోల్): రాయికోడ్ నూతన ఎంపీపీ ఎన్నికను బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మసూద్ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జహీరాబాద్ ఆర్డీఓ ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్నిక ఉంటుందన్నారు. ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. రాయికోడ్ ఎంపీపీగా ఉన్న వెంకట్‌రావు పాటిల్ కరోనాతో మృతి చెందగా అప్పటి నుంచి ఆ బాధ్యతలను వైస్ ఎంపీపీ మమత నిర్వర్తించారు. తాజాగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతన ఎంపీపీ ఎన్నిక చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలి



విద్యార్థుల ప్రయోగాలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రియాజుద్దీన్ సూచించారు. సైన్స్ డే ను పురస్కరించుకొని ఝరాసంగం మోడల్ స్కూల్‌లో పాఠశాల స్థాయిలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లైఫ్ సైకిల్ ఆఫ్ బటర్ ఫ్లై, చెత్తతో విద్యుత్ ఉత్పత్తి, ఎర్త్ పొల్యూషన్, సోలార్ సిస్టం, తదితర ప్రయోగాలను తయారుచేసి వివరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు.

పెద్దమ్మతల్లికి పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు: పెద్దమ్మతల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గం కొల్చారం మండలం రాంపూర్ గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మతల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవానికి మంగళవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మోహన్, రాజు, శ్రీనివాస్, యాదగిరి, మల్లేశం, రాము, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నెహ్రూ యువ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమాలు బుధవారం నిర్వహిస్తున్నామని యువ సంఘం జిల్లా అధికారి రంజిత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం చిరుధాన్యాలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమం, మధ్యాహ్నం సంగారెడ్డి జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలలకు సంబంధించిన విద్యార్థిని విద్యార్థులు ఎన్వైకే నిర్వహించి జిల్లా యూత్ పార్లమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకు భోజన సదుపాయంతో పాటు పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌ను అందజేస్తామని పేర్కొన్నారు.

విలీనం.. అభివృద్ధి శూన్యం

- ప్రగతికి నోచుకోని గ్రామ పంచాయతీలు
- పాలకమండలి లేక ప్రగతికి దూరం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- సమస్యలకు నిలయాలుగా విలీన గ్రామ పంచాయతీలు

జహీరాబాద్ మున్సిపాలిటీకి పాలకమండలి (కౌన్సిల్) లేకపోవడంతో విలీన గ్రామపంచాయతీలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. కౌన్సిల్ పీరియడ్ ముగిసి ఐదేళ్లు గడుస్తున్నా నేటికీ నూతనంగా కౌన్సిల్‌ను ఎన్నుకోకపోవడంతో విలీన గ్రామపంచాయతీలు సమస్యలకు నిలయాలుగా మారాయి. దీంతో పాలక యంత్రాంగం తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదివరకు గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు ఎంతో కొంత అభివృద్ధి కనపడేదని, విలీన పంచాయతీలుగా మార్చిన తర్వాత అభివృద్ధి మచ్చుకైనా కనబడటంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

- జహీరాబాద్ టౌన్



రంజోల్ గ్రామంలో ఇళ్ల మధ్యన నిలిచిన మురుగునీరు



గుంతలమయంగా జర్నలిస్టు కాలనీ రోడ్డు

జహీరాబాద్ పట్టణ సమీపంలో ఉన్న రంజోల్, పస్తాపూర్, అల్లీపూర్, చిన్న హైదరాబాద్‌తో పాటు హోతి(కె) గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. 24 వార్డులుగా ఉన్న మున్సిపల్ విస్తీర్ణాన్ని 37 వార్డులకు పెంచారు. అయితే ఈ విలీన గ్రామాలను పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి దూరంగా మారాయి. మున్సిపల్ పరిధి విస్తరించినా ఆశించిన మేరకు ప్రగతి పనులు చేపట్టడం లేదు. దీంతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టు, తాగునీరు, కరెంట్ వంటి సమస్యలు ఆయా గ్రామాల ప్రజలను వేధిస్తున్నాయి. సరైన మురుగు కాలువలు లేక మురుగునీరంతా ఖాళీ ప్రదేశాల్లో నిలిచిపోతోంది. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

మౌలిక వసతులు కరువు

విలీన గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన కాలనీల్లో ఆశించిన అభివృద్ధి కనిపించడంలేదు. ఆస్తి పన్ను రూపంలో మున్సిపల్‌కు ఆదాయం సమకూరుతున్నా అభివృద్ధి పనులపై శ్రద్ధ చూపడంలేదన్నారు. అల్లీపూర్‌లో ప్రధాన రోడ్లను ఊడ్చడం, మురుగు కాలువలను శుభ్రం చేయడం తప్పా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడంలేదు. పస్తాపూర్ గ్రామ పంచాయతీలో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. మహీంద్రకాలనీ, వసుంధర, ఆనంద్ నగర్ తదితర కాలనీలో సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మురుగుకాలువలు లేక మురుగునీరంతా రోడ్లపై పారుతుండటంతో పరిసరాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి.

ఆదాయం ఉన్నా.. కానరాని పురోగతి

జహీరాబాద్ మున్సిపాలిటీలో వెలుస్తున్న పెద్దపెద్ద కాలనీల నుంచి మున్సిపాలిటీకి భారీ ఆదాయం సమకూరుతున్నా అభివృద్ధిపై అధికారులకు పట్టింపులేదన్న విమర్శలు వస్తున్నాయి. జహీరాబాద్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న రంజోల్‌లో ఆశించిన మేర అభివృద్ధి జరగడంలేదు. ప్రధాన రహదారి గుండా వీధిదీపాలు ఏర్పాటు చేయగా పాలిటెక్నిక్, మెయిన్ రోడ్డులో మాత్రమే ఇటీవల మురుగుకాలువలను నిర్మించి చేతులు దులుపుకున్నారు. కానీ.. గ్రామంలోని వీధుల రోడ్లు గురించి మాత్రం పట్టించుకోవడంలేదు. హోతి(కె) గ్రామం గురించి అధికారులు కన్నెత్తి చూడడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. పట్టణాభివృద్ధి కోసం మంజూరైన నిధులను అభివృద్ధి పనుల కోసం కేటాయించినా పనులు మాత్రం జరగడంలేదన్న తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అదే విధంగా జర్నలిస్టు కాలనీలో సీసీ రోడ్డు కోసం రూ.30 లక్షలు కేటాయించామని ప్రచారం జరగ్గా ఇప్పుడు తమకు తెలియదని అధికారులు పేర్కొనడం గమనార్హం.

మున్సిపాలిటీ కౌన్సిల్ లేక..

మున్సిపాలిటీకి కౌన్సిల్ లేక విలీన పంచాయతీల గురించి పట్టించుకునేనాథుడు కరువయ్యాడని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ కౌన్సిల్ పీరియడ్ పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకూ ఎందుకు ఎన్నికలు నిర్వహించడంలేదని, తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్‌కు ఎన్నికలు నిర్వహించి విలీన పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు

ప్రత్యేక దృష్టి సారించాం



ఇటీవలే జహీరాబాద్‌కు బదిలీపై వచ్చాను. విలీన గ్రామ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. పారిశుద్ధ్య సిబ్బందిని ఎక్కువమందిని కేటాయించి ఎప్పటికప్పుడు చెత్త తొలగింపు మురుగు కాలువలను శుభ్రం చేయిస్తున్నాం. అవసరమైన చోట మురుగుకాలువలు, సీసీ రోడ్లను నిర్మిస్తున్నాం. తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

అవాస్తవాలను నమ్మొద్దు

కొండాపూర్(సంగారెడ్డి): సంయుక్త స్కూల్‌పై వస్తున్న అవాస్తవాలను విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మొద్దని సంయుక్త పాఠశాల డైరెక్టర్ రితేశ్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మల్కాపూర్ చౌరస్తాలో ఉన్న సంయుక్త పాఠశాలలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంయుక్త పాఠశాలలో కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులకు అనుగుణంగా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. సంయుక్త ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి సంయుక్త స్కూల్‌గా మార్చడాన్ని కొంతమంది ఉద్దేశపూర్వకంగా వివాదం సృష్టించాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఏ పాఠశాలకు అయినా ఇంటర్నేషనల్ అని పేరు ఉండకూడదని నిబంధన ఉండడంతో ఆ పేరును తొలగించినట్లు స్పష్టం చేశారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు కొంత ఆందోళనకు గురవుతున్నారని, ఈ విషయంలో ఎలాంటి అపోహలు వద్దని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఫీజులు తీసుకుంటున్నామని, సీబీఎస్ కోసం దరఖాస్తు చేశామని తెలిపారు. ఇందుకు సంబంధిత అధికారులు విజిట్ కూడా చేశారని గుర్తు చేశారు. సీబీఎస్ అనుమతి కూడా త్వరలోనే వస్తుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ తేజేష్ గౌడ్, ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల డైరెక్టర్ రితేష్ గౌడ్

విద్యార్థులు ధైర్యంతో ముందుకు సాగాలి

సంగారెడ్డి: విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దని, ధైర్యంతో ముందుకు సాగాలని ప్రముఖ సైకాలజిస్ట్ నళిని సూచించారు. సంగారెడ్డి పరిధిలోని వసతి గృహ విద్యార్థులకు, అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా పరిషత్ ఆఫీసులో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహ సంక్షేమ అధికారులకు వసతి గృహాల్లో జరిగే విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు, మానసిక ఆరోగ్యం గురించి, విద్యార్థి భావోద్వేగాల గురించి, పరీక్షల భయం, కౌమార దశలో విద్యార్థులకు ఎదురయ్యే సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, డాక్టర్ చక్రపాణి, డాక్టర్ మధుమోహన్, కల్పన, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు తారాబాయి, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ నళిని

పోలియో చుక్కలు వేయించండి

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలో పల్స్‌పోలియో యొక్క అర్హులైన చిన్నారులకు పోలియోచుక్కలు వేయించాలని మండల వైద్యాధికారిణి నాగమణి అన్నారు. ఇందిరాక్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. ఐదేళ్ల లోపు ఉన్న 6,685 మంది పిల్లలకు మార్చి 3వ తేదీన పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమానికి 5 రూట్లు, 50 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి బూత్‌కు నలుగురు సిబ్బందితో పాటు ఐదుగురు సూపర్‌వైజర్లు ఉంటారని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్త్‌వర్కర్లు, సీహెచ్‌ఓ గాలన్న తదితరులు పాల్గొన్నారు.



పోలియో శిక్షణ శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

మానవతను చాటిన సునీతమ్మ సేవా సంస్థ

హత్నూర(సంగారెడ్డి): ఆరేళ్లుగా పక్షవాతంతో ఇబ్బంది పడుతున్న వ్యక్తికి సునీతమ్మ సేవా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శివశంకర్‌రావు చేయూత అందించారు. ఈ సందర్భంగా శివశంకర్‌రావు మాట్లాడుతూ హత్నూర మండల పరిధిలోని బ్రాహ్మణగూడ గ్రామానికి చెందిన జగ్గయ్య ఆరేళ్లుగా పక్షవాతంతో కాలు, చేయి పడిపోయింది. అదేవిధంగా హత్నూర గ్రామానికి చెందిన చాంద్ పాషా ఏడాది నుంచి మీ-సేవ చుట్టూ తిరిగినా స్లాట్ బుక్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకొని సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్లాట్ బుక్ చేయించి మంగళవారం సంగారెడ్డిలోని సదరం క్యాంపు తీసుకెళ్లి సర్టిఫికెట్ మంజూరు చేయించినట్లు తెలిపారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించినందుకు బాధితులు సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.



దివ్యాంగులతో సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, బాధిత కుటుంబసభ్యులు

ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ

మనూరు(నారాయణఖేడ్): మండల కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం అకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో నిల్వ ఉన్న ఎరువులు, మందుల వివరాలు సేకరించారు. ఫెర్టిలైజర్ షాపుల యజమానులు తప్పకుండా సీడ్ లైసెన్స్‌లను ఆన్‌లైన్‌లో రిన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఈ నెల 29వరకు ఆన్‌లైన్‌లో రిన్యూవల్‌కు అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పన్నులు వసూలు చేయాలి

మునిపల్లి(అందోల్): వందశాతం ఇంటి పన్నుతో పాటు వివిధ రకాల షాపుల పన్నులు వసూలు చేయాలని ఎంపీడీఓ హరినందన్‌రావు అధికారులకు సూచించారు. మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో ఇళ్లు, వివిధ రకాల షాపుల యజమానుల నుంచి పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మితో కలిసి మంగళవారం పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మార్చి 15వ తేదీ వరకు వందశాతం పన్ను వసూలు చేయాలని ఉండగా ఈ నెల 31వ తేదీ వరకు వందశాతం పన్నులు వసూల్ చేయనున్నట్లు తెలిపారు. పన్నుల వసూలుకు సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎంపీఓ అంజలిదేవి, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పన్ను వసూలు రశీదు అందజేస్తున్న ఎంపీడీఓ హరినందన్‌రావు, అధికారులు

సంక్షిప్త వార్తలు

◆ **గుర్తుతెలియని వ్యక్తి మృతి**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామ శివారులో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారంలోని శ్మశానవాటిక సమీపంలో ఓ వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారాన్ని ఇచ్చారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గుర్తిస్తే తమకు సమచారం ఇవ్వాలని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిక**

కొండాపూర్(సంగారెడ్డి): మాజీ కాంగ్రెస్ నాయకులు సతీష్ ముదిరాజ్ తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సతీష్ ముదిరాజ్ మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. ఇదిలా ఉండగా గతంలో కాంగ్రెస్‌లో ఉన్న సతీష్ ముదిరాజ్ శాసనసభ ఎన్నికల సమయంలో ఆ పార్టీకి రాజీనామా చేసి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన విషయం తెలిసిందే.

◆ **దేవాలయ నిర్మాణానికి విరాళం**

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి బీజేపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి రూ.50వేలను మంగళవారం విరాళంగా అందజేశారు. అదేవిధంగా నాయకులు పల్నాటి భాస్కర్, శ్రీనివాస్, భాస్కర్, రాజేందర్ తదితరులు నిర్మాణానికి సిమెంటును అందించేందుకు ముందుకువచ్చారు. ఇందుకుగాను దేవాలయ నిర్వాహకులు విరాళాలు అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ **గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం-కొడకంచి గ్రామాల సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బొల్లారం సీఐ నయీముద్దీన్, జిన్నారం ఎస్ఐ రాజారావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వ్యక్తి మృతదేహం ముఖంపై తీవ్ర గాయాలు ఉన్నాయి. ఎవరైనా హత్య చేసి ఇక్కడ పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ **వాసవీ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం**

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ చతుర్థ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు తోపాజి అనంతకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ **మొక్కులు తీర్చుకున్న ఎంపీపీ**



జిన్నారం(పటాన్‌చెరు): ఎంపీపీ రవీందర్‌గౌడ్‌పై బీఆర్ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కాగా అవిశ్వాసంపై కోర్టుస్టే ఇవ్వటంతో ఎంపీపీ రవీందర్‌గౌడ్ మంగళవారం తీర్చుకున్నాడు. కొడకంచిలోని ఆదినారాయణస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సోలక్‌పల్లిలోని వినాయకుడి దేవాలయంలో 1000 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

◆ **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని దోసపల్లిలో సీసీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సిద్దారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **రెండు రోజుల్లో ఎమ్మెల్యే డ్రైవర్ రక్త నమూనాల నివేదిక**

పటాన్‌చెరు టౌన్: రామేశ్వరంబండ ఓఆర్ఆర్ పై కంటోన్మెంట్ ఎమ్మెల్యే కారు ప్రమాదానికి గురైన కేసులో పోలీసులు అన్ని ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆ సమయంలో ఓఆర్ఆర్‌పై వెళ్లిన వాహనాల వివరాలు తీసుకుని వారిని పిలిపించి విచారిస్తున్నారు. అలాగే వాహనాల వివరాలు కూడా సేకరిస్తున్నారు. అయితే డ్రైవర్ ఆకాష్ రక్త నమూనాల నివేదిక మరో రెండు రోజుల్లో రానుందని పోలీసులు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే లాస్య నందిత కారు ఏ వాహనాన్ని ఢీ కొట్టింది ఇంకా గుర్తించలేదని, విచారణ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

◆ **కారు, బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని వావిలాల గ్రామ ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయరావు తెలిపిన వివరాల ప్రకారం... బైక్‌పై వెళ్తున్న వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని, గాయపడ్డ వ్యక్తిని నర్సాపూర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషయమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ **నేడు సంకష్టహర చతుర్థి**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో వెలసిన సిద్ధివినాయక ఆలయంలో బుధవారం సంకష్టహర చతుర్థి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

◆ **స్కాలర్‌షిప్ విడుదల చేయాలి**

సంగారెడ్డి అర్బన్: స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ప్రభుత్వ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు సతీష్, సహకారదర్శులు రాజేష్, సాక్షి, వాణి ఉన్నారు.

◆ **మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం**

సంగారెడ్డి: అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, అదేవిధంగా అదనపు సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయబాబు సస్పెండ్ చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌కు కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకుడు యాదగిరి, తదితరులు ఉన్నారు.

◆ **రేషన్ కార్డులు అందజేయాలి**

కంది(సంగారెడ్డి): అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందజేయాలని సీపీఐ మండల నాయకులు ఎంఎ. ఖాజా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ కార్డుల కోసం పేదలు దరఖాస్తులు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా నేటికీ మంజూరు కావడంలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను అందజేయాలని కోరారు.

◆ **ఆరోగ్యంగా ఉండాలి**

మునిపల్లి(అందోల్): నాణ్యమైన ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సంధ్యారాణి అన్నారు. మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో పాటు ఇతరాత్ర సమస్యలుంటే ఉచితంగా ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

◆ **నూతన డ్రైనేజీలను నిర్మిస్తాం**



పటాన్‌చెరు టౌన్: నూతన అంతర్గత డ్రైనేజీ వ్యవస్థను నిర్మించేందుకు కృషి చేస్తామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ముదిరాజ్ బస్తీ, జేపీ కాలనీలలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నూతన డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం స్థల పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, ఆయా కాలనీవాసులు ఉన్నారు.

◆ **కళాశాల యాజమాన్యంపై చర్యలకు డిమాండ్**

నారాయణఖేడ్: ఒకేషనల్ కళాశాల విద్యార్థులకు ఫీజు బకాయిల పేరిట హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ఖేడ్‌లోని నలంద ఒకేషనల్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ కుమార్ అన్నారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేయాలని డిమాండ్ చేస్తూ కళాశాల ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా నాయకులు అశోక్, ఇసాక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

◆ **తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి**



రామచంద్రాపురం (పటాన్ చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ వెన్నవరం సింధురెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఫెన్సింగ్ కాలనీ, బీడీఎల్, విద్యుత్ నగర్ కాలనీలలో జలమండలి అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఫెన్సింగ్ ఏరియాలోని కాలనీవాసులు తాగునీటి సమస్య ఉందని ఆమె దృష్టికి తీసుకుని వచ్చారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ తాగునీటి పైపులైన్లను పరిశీలించి అవసరమైన చోట కొత్త పైప్ లైన్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీడీఎల్ కాలనీలో డ్రైనేజ్ పైప్ లైన్ మంజూరు అయిందని, పనులను త్వరగా పూర్తిచేసే విధంగా కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా మండలి జనరల్ మేనేజర్ రాజశేఖర్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.